క్లుప్తంగా

వాహనదారుడికి మూడు రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: అధికంగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వాహనదారుడికి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. టూటౌన్ పోలీసులు రెండు రోజుల కిందట చేసిన డ్రంకెన్‌డ్రైవ్‌లో యువకుడు అధికంగా మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ వస్తుండగా, బ్రీత్‌అనలైజర్‌తో పోలీసులు తనిఖీ చేయగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. సదరు వాహనదారుడిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఆర్.శశిధర్ మూడు రోజుల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు వాహనదారుడిని జిల్లా జైలుకు పంపించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విగ్రహాల తరలింపులో కొరవడిన స్పష్టత

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌గడ్డపై ఉన్న మహనీయుల విగ్రహాల తరలింపుపై శుక్రవారం అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో స్పష్టత కొరవడింది. తహసీల్దార్ నర్సింగ్‌రావు నేతృత్వంలో నిర్వహించిన ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో జాతీయ రహదారుల శాఖ డీఈ సుమిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. విగ్రహాలు తరలిస్తేనే రోడ్డు పనులు ముందుకు సాగుతాయని అధికారులు వివరించారు. అయితే ఎప్పటిలాగే విగ్రహాలు అక్కడే ఉంచాలని ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారుల చట్టం అందుకు ఒప్పుకోదని డీఈ వివరించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. విగ్రహాలను ఎప్పటిలాగే ప్రతిష్ఠించేందుకు ఒప్పుకుంటేనే తరలించేందుకు అంగీకరిస్తామని ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. దీంతో సమావేశాన్ని మరోమారు నిర్వహిద్దామని అధికారులు ప్రకటించి వెళ్లిపోయారు. సమావేశానికి నాయకులు కోడ్గల్ యాదయ్య, యంబీ బాలకృష్ణ, తెలుగు సత్తయ్య, కృష్ణలు పాల్గొన్నారు.

నేడు జడ్చర్లలో తిరంగా ర్యాలీ

జడ్చర్ల టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయం సాధించిన నేపథ్యంలో శనివారం సాయంత్రం జడ్చర్ల ఫ్లైఓవర్ నుంచి నేతాజీ చౌరస్తా వరకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ సంఘాల నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ 4 గంటలకు ప్రారంభమవుతుందని, పార్టీలకు అతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బాధితురాలికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన మదీనా జాహంగీర్ బీ ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలిని శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ పరామర్శించారు. ఆయనతో పాటు వెంకటాంపల్లి రాంచందర్, టైలర్ కలీం, ఖలీల్, నారాయణ ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పోల్కంపల్లి గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.వేణు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పస్పులలో మార్మోగిన శివ నామస్మరణం

మరికల్: మండలంలోని పస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శివ నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్యన నూతన ఆలయంలో గౌరి శంకర శివలింగ, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యం, నాగదేవతలు, నవగ్రహ సహిత, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. మరో ఆలయంలో మైసమ్మ, నాభిశిలా, బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పేదలను పట్టించుకోని 'బీఆర్‌ఎస్'

- పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలే..
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



వెంకటాపూర్‌లో లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసిడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కాలం వెల్లదీసిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ పేదలకు గూడు కల్పిస్తుందన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని అన్నారు. ప్రజాపాలనలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. రానున్న నాలుగేళ్ల కాలంలో సుమారు 14 వేల ఇందిరమ్మ ఇళ్లు కేవలం మహబూబ్‌నగర్ నియోజకవర్గానికే వస్తాయని తెలిపారు. దశల వారీగా అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లను అవమానం చేస్తూ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మోసం చేశారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, గృహ నిర్మాణశాఖ పీడీ వైద్యం భాస్కర్, ఎంపీడీఓ కరుణశ్రీ, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, వెంకట్రాములు, మాధవరెడ్డి, హన్మంతునాయక్, ప్రసాద్, గోపాల్, గోవింద్‌యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



చిన్నవడ్డేమాన్‌లో లక్ష్మీకాంత్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవడ్డేమాన్‌లో రెండు మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి, వడ్ల పెద్ద లింగన్నలు అనారోగ్యంతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న బోయ గోవిందును, బోయ సువర్ణలను పరామర్శించారు. వారి వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

వార్డు ఆఫీసర్లే కీలకం

- అందరూ సమన్వయంతో వ్యవహరించాలి
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలన యంత్రాంగంలో వార్డు ఆఫీసర్లే కీలకమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పాలమూరుతో పాటు జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలలో పనిచేసే వార్డు ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా డివిజన్లు, వార్డులలో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పన్ను, నల్లా బిల్లులు సక్రమంగా వసూలయ్యేలా చూడాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేయాలని, ఆయా విభాగ అధికారులకు ఎప్పటికప్పుడు కావాల్సిన సమాచారం ఇవ్వాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈ సందీప్‌వరల్డ్, ఏసీపీలు కరుణాకర్‌గౌడ్, జ్యోత్స్నదేవి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకరూపాయికే భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్(బాలానగర్): అన్ని దానాలో కన్నా అన్నదానం గొప్పదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 100 డ్రీమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసూక్తం ఒక్కరూపాయికే భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి పేదలు అనారోగ్యంతో వైద్యంకోసం వస్తారని, అలాంటి వారికి ఒక్కరూపాయికే భోజనం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యంగా పది రూపాయలు ఖర్చు చేయాలంటే ఆలోచించే ఈరోజుల్లో 100 డ్రీమ్స్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని బాలానగర్‌లో ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి చంద్రకళ, ఫౌండేషన్ చైర్మన్ కృష్ణమానినేని, మండల నాయకులు ఆదిరమణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శంకర్ నాయక్, తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహాలకు ఎమ్మెల్యే పూజలు

మిడ్జిల్: మండల పరిధిలోని బోయిన్‌పల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి, అనంతరం సన్మానించారు. బొడ్రాయి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బంగారు, అల్వాల్‌రెడ్డి, సత్యం, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి 15 సూత్రాలు అమలు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో మైనార్టీల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి 15 సూత్రాల అమలు చేయాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్‌బాబా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రాల్లో కమిటీలు ఏర్పాటు చేసి ప్రధాన మంత్రి 15 సూత్రాల అమలు కార్యక్రమాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా అవకాశాలు మెరుగు పరచడం, ఐసీడీఎస్ సేవలు, సర్వ శిక్షా అభియాన్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ యోజన, మదర్సాల ఆధునీకరణ, ఉర్దూబోధన, స్కాలర్‌షిప్‌లు, ఉపాధి, ఎస్‌జీఎస్‌వై, ఎస్‌జేఎస్‌ఆర్‌వై, సాంకేతిక శిక్షణ, బ్యాంకు రుణ సహాయం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మైనార్టీల ప్రాతినిధ్యం, ఇందిరా ఆవాజ్ యోజన (ఐఏవై), ఇంటిగ్రేటెడ్ హౌజింగ్, స్లమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐహెచ్‌ఎస్‌డీపీ), జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం), గృహ నిర్మాణ, మౌలిక సదుపాయాలు అందించడం ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలని తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మైనార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలంతా ఏకమై వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా గత నెలలో జరగాల్సిన సభను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈనెల 25న సాయంత్రం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగే బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాలోని ముస్లింలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణకు వ్యతిరేకంగా జరిగే సభలో ముఖ్య అతిథులుగా ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షులు ఖాలెద్ సైఫుల్లా, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, సీఎం ఇబ్రహీం, ఇతర మతపెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షులు ఎండీ.ఫయాజ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభకు ముస్లింలు, యువత భారీ ఎత్తున పాల్గొని వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా తమ నిరసన తెలపాలని కోరారు. సమావేశంలో నాయకులు అజ్మత్‌అలీ, ఫక్రుద్దీన్ ఖురేషి, ఖాజాపాష, అంజద్, పీర్ సాధిక్, ఫహీం, తదితరులు పాల్గొన్నారు.

వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- డీఈఓ ప్రవీణ్‌కుమార్



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల టౌన్: వృత్యంతర శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో కొనసాగుతున్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిలా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవటం, విద్యార్థులకు సులువుగా బోధించటం ఎలా అనే అంశాలపై పరిశోధన చేయాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ మంజులాదేవి పాల్గొన్నారు.

రాజాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీన్‌కుమార్ తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐదు రోజుల ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌లో 25వ ర్యాంక్



ప్రశాంత్

జడ్చర్ల టౌన్: ఇటీవల విడుదలైన యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ 2025లో బాదేపల్లి పట్టణవాసి గోప్లాపూర్ ప్రశాంత్ 25వ ర్యాంక్ సాధించాడు. దేశవ్యాప్తంగా 143 మంది ఐఎఫ్‌ఎస్‌లో ఉద్యోగాలు సాధించగా వారిలో ప్రశాంత్ ఒకరు. ప్రశాంత్‌కు 25వ ర్యాంక్ రావటంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు కావలి కృష్ణ, ప్రధాన కార్యదర్శి జీవన్, గౌరవ అధ్యక్షుడు కొంగళి మోహన్‌రాజ్‌లు అభినందించారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించి లబ్ధిదారుకు ప్రొసీడింగ్ అందిస్తున్న అధికారులు

నవాబుపేట: లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కారుకొండ, సిద్దోటం, ఇప్పటూర్, ఊరంచుతండాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లు లేనివారికి రూ.5 లక్షల వ్యయంతో ఇంటిని నిర్మించే అవకాశం కల్పించిందన్నారు. ప్రతి సోమవారం ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రోగ్రెస్ రిపోర్టు ఆధారంగా బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయన్నారు. ఇంటి నిర్మాణం ప్రభుత్వం చెప్పిన ప్రణాళికల ప్రకారం నిర్మిస్తే లబ్ధిదారులకు ఎలాంటి అప్పులు లేకుండా ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ నర్సింహారెడ్డి, ఎంపీఈఓ భద్రునాయక్, భూపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, డాక్టర్ మీనాక్షి, కృష్ణయ్య, సంతోష్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- ఏఎంఓ శ్రీనివాస్

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలో 4వ రోజు శుక్రవారం ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులకు ముందస్తు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేసి మంచి విద్యాబోధన చేయాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఆర్‌పీలు రవీందర్, వెంకటేష్, ఈవీఎస్ సురేష్, రాణి, రాఘవేందర్, మయూరి, సునిత, సింధూజ, తదితరులు ఉన్నారు.

మామిడిపండ్లతో వాసవీమాత అలంకరణ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని 150 కిలోల మామిడి పండ్లతో అలంకరించారు. ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల సందర్భంగా అమ్మవారిని మామిడిపండ్లతో అలంకరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు శివ్వరేఖ, జ్యోతి, సంధ్యారాణి, శ్రీలత, స్వర్ణలత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ జాగృతి సేన నాయకులు

జడ్చర్ల టౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో ప్రతి ఏటా పుట్టగొడుగుల్లా పాఠశాలలు వెలుస్తున్నాయని, నియమ నిబంధనలు పాటించటం లేదని, ఆటస్థలం లేకుండా ఇరుకు గదులు, మొదటి, రెండు, మూడు అంతస్తుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు నర్సింహులు, నాయకులు సురభి విజయ్‌కుమార్, లింగంపేట శేఖర్, చెన్నయ్య, వెంకటేష్, శ్రీను, శంకర్‌లు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణంతో లోకకల్యాణం



సుందరకాండ పారాయణం చేస్తున్న దీక్షితుల సుబ్రహ్మణ్యం

జడ్చర్ల టౌన్: సుందరకాండ పారాయణంతో లోకకల్యాణం జరుగుతుందని పారాయణ కర్త దీక్షితుల సుబ్రహ్మణ్యం అన్నారు. కావేరమ్మపేట శివాలయంలో పోల వెంకయ్య ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న సుందరకాండ పారాయణం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతను పెంపొందించుకోవాలన్నారు. సుందరకాండ పారాయణం జరిగిన చోట భూతప్రేత పిశాచాలు దరిచేరవని, గ్రహదోషాలు నశిస్తాయని, ఆరోగ్యం, వంశాభివృద్ధి, అనుగ్రహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లి నుంచి నిజాలాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఓ వైపుకు ఒరిగి కిందపడేలా ఉన్న స్తంభం వల్ల స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దగా గాలులు వీస్తే కిందపడేలా ఉన్న స్తంభంతో పాటు మరో స్తంభం కూడా ఇదే విధంగా ఉంది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈదురు గాలులకు కరెంటు స్తంభం నేలకూలే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు సిద్ధం



నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలలకు నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి పుస్తకాలు సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ నాగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో మొదటి విడతలో 75 శాతం పుస్తకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. పాఠశాలల ప్రారంభం నాటికి వందశాతం పుస్తకాలు వస్తాయన్నారు. ముందే పుస్తకాలు రావటంతో పాఠశాలల ప్రారంభం నుంచే విద్యార్థులకు బోధన ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హేమారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల నాయకులు, రైతులతో కలిసి ఆయన జీలుగ విత్తనాలను పంపిణీని చేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లో ఏఈఓలను సంప్రదించాలని హేమారెడ్డి సూచించారు.



ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు



మహమ్మదాబాద్‌లో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మహమ్మదాబాద్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి అనంతరం భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టుబెట్టి వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేసిన సాయుధ దళాలను మెచ్చుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ భారత దళాల గౌరవ సూచకంగా గురువారం మహమ్మదాబాద్ మండలంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత దేశంపై కన్ను వస్తే ఏదేశానికైనా ఇదేగతి పడుతుందని హెచ్చరించారు. ఉగ్రవాదులను ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశాలకైనా ఇలాంటి పరిణామాలు తప్పవని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తిరంగా ర్యాలీ నంచర్ల, గాధిర్యాల్, జూలపల్లి, మంగంపేట్, చౌదర్‌పల్లి మీదుగా మహమ్మదాబాద్ చేరుకుంది. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గిరమోని శ్రీనివాస్, గండేడ్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, పవన్, శ్రీనివాస్, వెంకటేశ్, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.